# శనీస్వరుడు

తూర్పున ధగధగమండే అగ్గిబాణం మాదిర్తో ఎర్రంగా నిగనిగలాడతా ఆకాసింలోకి పొడచకొస్తా వుండాది పొద్దు.

గోరెచ్చగా బూమమ్మను తాకతావుండాది యెండ. సెట్ల ఆకుల సందుగొందుల్లో గుండా రాలిపడిన యెల్తురు తునకలు నేలతల్లి వళ్ళుమింద తేలిన తెల్లపొడ మాదిరి కనిపిస్తావుండాయి.

వొగరిద్దరు రైతులు పసరాల పగ్గాలు సేతబట్టుకోని తోలకపోతా వుండారు. ఇంకొందరు సేద్దెం కొరముట్లు ఎత్తకపోతా కనిపిస్తా వుండారు.

ఏ పనీ పాటా లేకుండా ఉలపాగా తిరిగే కోర పిలకాయలు కొందరు వోళ్ళోళ్ళ ఇండ్ల ముందర కూసుండే దానికి యేసిండే బండ్లమింద, అరుగుల మింద కూసోని ఏందేందో మాట్లాడుకుంటా వుండారు. నడిపాయంలో వుండే కొందరు ఆడోళ్ళు ఊరి ముందరుండే బోరింగునించీ నీళ్ళు కొట్టి, బిందెల్ని సంకన బెట్టుకోని మోసక పోతా వుండ్రి.

ఆ బోరింగు దాటుకుంటానే రచ్చబండ. దానికి నేరుగా ఈది పక్కన రాములోరి గుడి. దానికి కొంత దూరంలో గుడి బండనించి వొగ కాలిదోవ పోతావుండె. వొగ పెద్దాయన నోట్లోవొగవొక్క యేసుకోని యెలబారినాడే అనుకో. ఆ వక్క కొరికినంత దూరం ఆయప్ప నడస్తాడు సూడు. అంత దూరంలో కానగలకాన వొగటుండె. ఆ కానగల కానలో దూరివస్తావుండే కాలిదోవ రాములోరి గుడి పక్కగా వచ్చి ఈదిలో కలస్తా వుండె. ఆ దోవ ఈదికింకో పక్కన ... కొంత దూరం పాయినాక పడమటగా మలుపుదిరిగి మహలు, కదిరాయి సెరువుకు బోయే కాలిబాట్లో కలస్తావుండె. అదే రాసీడుకుబోయే రోడ్డు.

ఆ కానగలకాన దాటుకోని పదయిదేండ్ల తర్వాత మళ్ళా అడుగుపెట్టె జయరాముడు.

'భద్రం బల్లా కోడి ... కొంచెం మెలకవగా వుండు' అంటా 'జయరాముడి ఇంగితం యెచ్చరిస్తానే వుండె.

ఇప్పుడు గనక నన్ను మాపగోరు గుర్తు పట్నారా, ఏ పక్కనించీ ఏ ఆపితి వచ్చి పడుతుందో ఏమోనంటా అయప్ప మొణుసులోను రాగ్గింజంత అనమానం లేకుండాపోలే.

గుడి మలుపు తిరిగి ఈదిలోకి అడుగు పెట్టిన జయరాముడు ఈదినంతా వొగసారి జూశ. ఈదిలో ఎక్కడా ఎట్టాంటి సందడి సంబరం కనిపించలా. అక్కడక్కడా మడుసులు కనిపిస్తా వుండ్రిగానీ వోళ్ళ మొగాల్లో ఎట్టాంటి సంతోసమూ అగుపడలా. పెతివోడూ యేందో పోగొట్టుకున్నోని మాదిరిగా కనిపిస్తా వుండె.

ఊరంతా మల్లా వొగతూరి కలజూశ జయరాముడు.

"రామసామి గుడి అట్టే ఉండాది. ఆ రాగి సెట్టు అట్టే వుండాది. రచ్చబండా

మామూలుగానే వుండాది. కానీ ఊరు మాత్రం ముందు మాదిర్తో లేదే. మొండిగోడలు, జారిపోయుండే కప్పులు, పెచ్చులూడిపోయి, శ్యానా పురాతనమైనవి మాదిరిగా కనపిస్తా వుండే ఇండ్ల గోడలు ... యెట్టున్న మూరు! యెట్టయిపోయుండాది! నేను న్నబ్బుడు బాగుండ్లా? మొణుసులోనే యాస్టబోతా వాగ నిట్టూర్పిడిసి ఉస్సుబ్బాంట నడస్తానే వుండె.

మడిసి బుద్దిని కుక్కంటారు. ఆ కుక్కను కట్టేసుకున్నోడే మహన్నభావుడంటారు ... జయరాముడంతటి మహన్న భావుడు గాదే. అందుకే ఆయప్ప మొణుసు కోతి మాదిరెగరతా వుండె. ఏందేందో మొణుసుకొచ్చి సుట్రకపోతా వుండె.

అందరూ ఊర్లోనే ఉండారు. భౌతికంగా పక్కపక్కనే జీవిస్తా వుండారు. అయినా, మానసికంగా మాత్తరం వోళ్ళ మద్దెన ఆమడలుగాదు యోజినాల దూరం వున్నట్టనిపిస్తా వుండాది. వోళ్ళ మొగాల్లో సూడు. అంతంలేని బాదేందో కండ్లాబూసి ఆడతా వుండాది. అందుకేనేమో ఏదో పుట్నాం ... పుట్నాం కాబట్టి బతకాల బామాల తప్పదు - అన్నిట్టు యేందో నిరాశ ... వోళ్ళ కండ్లల్లో అగుపిస్తానే వుండాది.

వొగబ్బుడు వచ్చిపోయే బందుగుల్తో, ఏ అడ్డూ ఆపూ లేకుండా ... ఈదిలో, ఏ భయమూ లేకుండా అడ్డపడి తిరిగే పసరాల్తో, ఎగిరెగిరి దూంకే పిలకాయల ఆటపాటల్తో, ఇరుగుపొరుగోళ్ళ ముచ్చట్లు ముదిగారాలతో ఎప్పుడూ కుశాలగా, సందడిగా వుండె ఊరు.

కానీ ఊర్లో ఆపరిస్తి కలికానికైనా కనిపించలా ... జయరాముడి మొణుసులో ఎక్కడో, ఏమూల్నో ఏదో ముల్లు గుచ్చుకున్నిట్టు కలుక్కుమనె.

మెల్లిగా అడుగులో అడుగేసుకుంటా, అయినోళ్ళ, పోయినోళ్ళ ఇండ్లన్నీ సూసుకుంటా జయరాముడు ముందుకు బోతానే వుండె. పొగులంతా పల్లెల్లో తిరిగి రేత్తిరయితానే రాములోరి గుడికొచ్చి పడుకునే బైరాగి అప్పటికే లేసిండె. లేసినోడు లేసి నట్లుండక, సెరువులో తానమాడొచ్చి కూసోని ఏకునాదం వాయిస్తా "ఏకులమనినను వివరమడిగితే ఏమని చెప్పుదు లోకులకు - పలుగాకులకూ" అంటా తత్త్వం పాడుకుంటా గుమ్మగమాలించేస్తా వుండె. ఆ తత్త్వం ఇనుకుంటా రచ్చబండమిందుండే ఇద్దరు ఆయకట్టు మొగోళ్ళు సిగ్గూ సెరమూ లేకుండా పెద్ద మొనగోళ్ళు మాదిర్తో నక్కాముట్టే ఆడుకుంటా వుండ్రి. రచ్చబండ కవతల, రాశింటి ముందరుండే అరుగుమింద కూసోని బీడీలుదాక్కుంటా ఈదిలో వచ్చీపోయే వర్సైన ఆడపిలకాయల్తో జారాట్లాడుకుంటా వుండ్రి.

వోళ్ళ నందర్నీ దాటుకోని జయరాముడు పోతానే వుండె. ఇంతలో వొగింట్లోనించి వొగ బెడస కోడిని, ఇంగొగ కోర్లకోడిపుంజు తరుంకుంటా వస్తే, ఆ బెడస కోర్‌కోర్ మంటా వచ్చి ఎగిరి ఆయప్ప మింద పడబోయ. జయరాముడి గుండె వొగసూరి గుబిల్లుమనిపాయె. అయినా పిల్లోడు శ్యానా న్యాగ్గా తప్పించుకుండె. ఆ అన్నేకారి కోడి పక్కింటీ వర్సుకోని పోయి దూరంగా దూంకేశ. ఆ సద్దుకు ఈదిలో వుండే వోళ్ళంతా వొగసూరి ఆయప్పకల్లా జూసిరి. అదీ యెట్ల

జూసిరి?

కొందరు దొంగను జూసినట్లు జూసిరి. ఇంకొందరు అయినోన్ని, బందుగును జూసినట్లు ముదిగారంగా జూసిరి.

రచ్చబండ మింద నక్కాముట్టే ఆడేటోళ్ళు జూసిరి. చూసి, వొగాయప్ప "ఈడు వోడుగానే ఉండాడు. ఎందుకొచ్చినట్లో?" అంటా ఇంకో నేస్తున్తో అనె.

"అంత ఎసుగాయంతప్పుడు, న్యాత వయసులో యెల్లి పోయినోడు ఇప్పుడెందుకొచ్చినా డబ్బా?" అంటా ఇచ్చిత్తరక పోతా సూస్తా వుండె ఆ నేస్తుడు.

"ఈ ఊబిలోకి మల్లా ఎందుకొచ్చి పడినాడబ్బా?"

"ఇబ్బుడు అసలోళ్ళు గనక జూసిరో ఈయప్పకు ఆపితే." గుసగుస మాట్లాడుకోబట్రి.

ఈదిలో బండ్లమింద, అరుగుల మిందవుండే వోళ్ళు అదే మాదిరిగా మాట్లాడుకో బట్రి.

"ఎవుర్రో ఈ కొత్త మడిసి?"

"ఏమొ తెల్దురా!"

"ఆ ఇంటి కల్లానే బోతా వుండాడే..."

"ఆ పాడు కొంపకల్లా ఎపుడు బోతాడు? అసలు ఏముందని బోతాడు?"

"అవురో! అట్లే బోతా వుండాడు. వోడు వోడుగానే వుండాడబ్బా జయరామరెడ్డి."

"ఏమొ. ఆ ఇంటి కాడికి బోతేగానీ సెప్పలేం?"

జయరాముడికి ఆ మాటలు అరకొరగా ఇనిపిస్తానే వుండె. కానీ ఆ యప్ప అవేవీ పట్టించుకోలా. ముందుకు బోతానే వుండె.

అట్ల ఇంకొన్నిండ్లు దాటుకోని వొగ పెద్ద మిద్దింటి ముందరాగె.

ఆ ఇల్లు ఏ ఆలనా పాలనా లేకుండా పిచ్చిపిచ్చిగా కనిపిచ్చే దిక్కులేని మడిసి, అనాద మాదిర్తో కనిపిస్తా వుండె. బాగా పాడుబడిపోయిండె. దాని ముందర, సుట్టకారమూ గెడ్డి, గెరిక బల్సకపోయిండె. అప్పుడెప్పుడో యేసిండే బీగం, అట్టే వుండెగానీ అది ఎండకు ఎండి, వానకు తడిసి బాగా సిలుంబట్టి పోయిండె.

ఆ ఇల్లు సూసేగుండికి ఆయప్ప గుండి కాయలు నీర్రైపాయ. కడుపు సెరువైపాయ. దుక్కం ముంచకొచ్చేశ. ఎదలోనించీ తన్నకొస్తావుండే బాధ గొంతులోనే మింగుకుండె ... నిరాశగా వొగసూరి నిట్టూర్చె.

"యెట్టున్నె ఇల్లు! యెట్లయపాయ!" అంటా నొప్పిగా మొఖుసులోనే కుమిలిపాయ.

"ఆ .. జరిగిపోయిండేది తల్సుకోని వొగిరిస్తే ఏం నాబం? ఏదో, అయి పూడిసింది ..." అంటా మళ్ళా దైర్నం దెచ్చుకుండె. మొఖుసు నిమ్మళించె. మనిసి తెపరాయించుకుండె.

వొగడుగు ముందుకేసి, బీగం పట్టుకోని లాగె. ఊహూఁ. అదిరాలా. ఎంత సిలుంబట్టి పోయిన్నా బలే గెట్టిగానే ఉండె. ఆయప్ప సేతికి ఎర్రంగా సిలుముదుమ్ము అంటుకుండె.

రెండు సేతులూ వొగతూరి సూసుకోని ఇదిలించుకుంటా అట్టా ఇట్టా జూశ.

అడ ... పక్కన్నే వొగ పెద్దరాయి అయప్ప కోసరమే అన్నిట్టుండె. దానికల్లా రెండడుగులేసి వొంగి, రెండు సేతల్తో ఆ రాయి నెత్తకొచ్చి, దాంతో బీగానికి బట్టి కొట్టబట్టె. అట్ట రొండేట్లు రాత్తో పడినో లేదో ఇట్ట బీగం కొండి టక్కన తెగిపాయ. రాయిని పక్కనేసి, బీగం ఊడదీశ, తలుపుకు అతక్కపోయిండేగెడిని గూడ ఎట్లనో వొగట్ల ఊడదీసి, సిలుకుదీశ. అనాక రెండు సేతల్తో తలుపును తోశ. ఊహూ ... అది కదల్లా, మెదల్లే. గోరంత సందయినా వొదల్లే. అది బాగా సెదులు బట్టిపోయి దాలమందరాలకు అతక్క పోయిండె. పైగా నుసికూడా పట్టిపోయిండె. గెట్టిగా తంతే ఇరిగిపోయి నుగ్గు నుగ్గు అయిపోయేట్టిగా ఉండె.

ఎట్టనో మెల్లిగా తలుపుతోసి కాసింత సందు జేసుకోని ఇంట్లోకి అడుగుబెట్టె.

ఇళ్ళంతా గొబ్బుగొబ్బుగా వుండె. గలీజుగా వుండె. జానెడెత్తు సెత్తా సెదారం యెట్టంటే అట్ట పడుండె. కొంపంతా గబ్బిలాలకంపు కొడతావుండె. ఇళ్ళంతా దూదరగూళ్ళు కమ్మేసిండె. నేలమింద యాడజూసినా ఎలకల పెంటికలే. ఇళ్ళంతా ఎలకల బొక్కలు, ఆ బొక్కల్లో నించీ ఎలకలు తోడిన మట్టికుప్పలు ... సిన్న సిన్న కొండలు మాదిరి కనిపిస్తా వుండె.

ఆ వాసనకు వొగతూరి మొగంసిట్లించేశ జయరాముడు. తలుపు తెరిసినందువల్లా లోపలికి జొరబడిన యెల్తురుకు ఉక్కిరిబిక్కిరి అయిపోయిన ఎలికలు, గబ్బినాలు కీసరబాసరమంటా అరస్తా ఇళ్ళంతా పరిగెత్త బట్టె. వొగ గబ్బిడాయి ఆకాసివ్వ మాదిర్తో దూసకొచ్చి యెంటిక వాసిలో, సెవుదెగ్గిర వొర్సుకుంటా బాయ. అయప్ప వొగ్గెడివు బిత్తరక పోయి దానికల్లానే సూస్తా వుండిపాయ.

ఆ నేల మింద అడుగు పెట్టంగానే అయప్ప మొణుసులో వొగ పక్కన సంతోసము, ఆనందము, ఇంగోపక్కన ఏదో సెప్పనలివిగాని వొగ మధరమైన ఇది గలిగె. దాంతో బాటుగా ఎదలో ఏదో ముల్లు గుచ్చుకున్నిట్టు వొగిటే యెసనం. అన్ని యేండ్ల నించీ గుండికాయలో గూడు కట్టుకోనున్నె మనే దంతా బయటికి రాబట్టె.

అది అయప్ప పుట్టినిల్లు. అయప్ప పెరిగిన తావు. మొట్ట మొదలుగా ఈ పెపంచికాన్ని సూసిన తలం. ఇద్దే బుద్దులు నేర్చిన నెలవు.

అది ... అయనోళ్ళపోయనోళ్ళందరి ప్రేమలు, మమతలు, మమకారాలు అపురూపంగా అందుకున్న తావు.

◆ ◆ ◆ ◆

సుమారుగా పదయిదేండ్లకు ముందు మాట.

అప్పటికి ఆ ఊరు శ్యానా పెశాంతంగా, నిమ్మళంగా వుండె. ఊర్లో ఏ రొంపులూ రాగింతాలు లేకండా, అందరూ వొగేకట్టుగా బతకతా వుండ్రి. వొగ జట్టుగా నిలస్తా వుండ్రి. వొగే

తాటి మింద నడస్తా వుండ్రి.

అందాజుగా అది నూరిండ్ల పల్లె. ఆ నూరిండ్లల్లోను రెడ్లుండ్రి, కురబోళ్ళు, గొల్లోళ్ళు వుండ్రి. అందులో రొండిండ్లు సాకలోళ్ళవి. వొగిల్లు మంగలోళ్ళది. ఇంగో అయిదారిండ్లళ్ళో సాలోళ్ళు, తొగటోళ్ళు వుండ్రి. వొగింట్లో కుండలు జేసె కుమ్మరోళ్ళు వుండనే వుండ్రి. అయినా అందరూ అన్నదమ్ముల మాదిర్తో కలిసి మెలిసి పోతావుండ్రి. కులాలేరయినా ... అక్కా, మామా, సినాయనా, సినమ్మా, అత్తా అంటా వొగర్నొగరు వరసలు బెట్టుకోని పిల్సుకుంటా వుండ్రి. వోళ్ళకు పట్టింపులే లేవు. కులమనేదే వోళ్ళ మొఖుసుల్లోకి రాకండానే బతకతా వుండ్రి. ఇంక మత మంటావా? అది వోళ్ళకు తెలీనే తెలీదు. అది రాసీడుకు, మహలుకు మద్దెనుండే ఊరు. దాని పేరు కత్తేవారి పల్లె. ఆ ఊరు జనాలంతా అంత అయికమత్తెంగా వుండారంటే దానికి కార్నం ఆ ఊరి సర్పంచులే.

ఆ ఊరికి ఎన్నో తరాలుగా పెద్దిరెడ్డోళ్ళే పెసిరింట్లుగా ఉంటా వచ్చిరి. ఇప్పటికీ పెద్దిరెడ్డి హయాం నడస్తా వుండాది ...

పెద్దిరెడ్డి దేముడబ్బాన్నె, సెడ్డోడబ్బాన్నె రొండూ నిజ్జంగాదు. కానీ శ్యానా శ్యానా మంచోడు... ఆయప్ప సొనంతర యోధుడు. అప్పుడెప్పుడో ఇంగిలీసోళ్ళ కాలంలో గాంధీతాత కడపకొచ్చినాడంట... అప్పటికి పెద్దిరెడ్డి పసోడు. గాంధీ తాతను సూసే దానికి కడపకు పొయ్యి సూసొచ్చినాడంట ... ఆయప్ప సెప్పే మాటలిని సత్తేగ్రహంలో గూడ కూసున్నాడంట ... అందుకు అందర్తోబాటు పెద్ది రెడ్డినీ జైలుకు పంపినారంట. అందువల్లా ఆయప్పకు రాసీడులో గాంధి తాతకున్నంత పేరుండె. నిజ్జంగా కూడా ఆయప్ప గాంధీమంటోడే...

ఆయప్పకు అందరూ సమానమే. పచ్చపాతమే ఎరగని మారాజు. ఆ ఊర్లో ఎవురికి ఏ కట్ట మొచ్చినా, ఏ నట్టమొచ్చినా ముందుంటాడు. ఆయప్ప హయాంలోనే ఆ ఊరికి కరంటొచ్చె. వొగ ఆసుపత్తిరి, వొగ పోస్టాపీసు వచ్చె. వొగ ఎలిమెంట్రీ ఇస్కూలొచ్చె. వాటికోసరం పెద్దిరెడ్డి ఎంతో దుడ్డు శెలవజేశ. అయినా అట్లాంటిదంతా ఆయప్ప లెక్క చేసేటోడు గాదు. ఊరుబాగుంటే సాలనుకునే వోడు. 'నాకు దేముడిస్తా వుండాడు. తిండికీ, గుడ్డకూ కొదవ జెయ్యాలా, నలుగురికి మేలు జేస్తే సాలు అనుకునే మడిసి మంచికి పేణాలైనా ఇచ్చే రకం.

అందుకే పెద్దిరెడ్డి గురించి ఆ ఊర్లో ఎవుర్నడిగినా "ఆయనకేం సామీ! మహన్న భావుడు. సేతులెత్తి దండ పెట్టాల్సిన పెద్దమడిసి" అంటా సెప్తారు. అటుమంటోడు పెద్దిరెడ్డి.

పెద్దిరెడ్డికి నలుగురు కొడుకులు. పెద్దోడు బసిరెడ్డి, రెండోవోడు సుధాకర్ రెడ్డి, మూడో వోడు నరిసిమ్మ, నాలుగోవోడు ఆయలప్పరెడ్డి. ఈళ్ళుగాక అయిమావతి అనే వొగ ఆడకూతురుండె. ఆ అయిమావతిని పెద్దిరెడ్డి, గుడిబండలో వొగ మంచి సాలుసంప్రదాయముండే ఇంట్లో ఇచ్చి పెండ్లిజేశ. పెద్ద కొడుక్కి పొద్దుటూరినించీ, తన స్తాయికి తగినట్టు మంచి కుటింబరం నించీ తెచ్చిజేశ.

ఆ బసిరెడ్డికి అయిదారేండ్ల కొడుకు. మిగిలినోళ్ళ కింకా పెండ్లిండ్లుగాలా.

అద్దో ఆ బసిరెడ్డి కొడుకే జయరాముడు. అసలు పేరు జయరామిరెడ్డి. బసిరెడ్డి భారీయ్య్ ఈరనాగమ్మంటే ఆ ఊర్లోనేగాదు, ఆ ఇంట్లోను బలేమరేద. మరుదులకందరికీ ఆయమ్మంటే బగితి, బయం, ఆయమ్మ శ్యానా మంచిది. పెండ్లయిన మరుదినమే అత్తా మామలకు కూతురుకంటే ఎక్కువైపాయ. మర్దుల్ని గూడా కొడుకులు మాదిరనుకునే ఆడది. అందుకే ఆయమ్మకు ఆ ఇంట్లో ఎదురుండదు.

ఆ ఇంట్లో సిన్న పిలకాయలు లేని కొరత తీర్చిన జయరాముడంటే అందరికీ మురిపమూ ముదిగారమూను. ఆ బిడ్డంటే ... వొంగిశానికే వారసుడయిన వాగేవాగ మొలక అనుకునే మడుసులు వోళ్ళు.

జయరాముడికీ సినాయన గారంటే బోబెమత. ఆ సినాయన్ల మద్దెన ఎంతో అపురూపంగా పెరిగినోడు జయరాముడు.

అయితే తరాలు మారిన అంతరాలు మారవన్నిట్టు ... పెద్దిరెడ్డి ఎంత నిమ్మతి మడిసో, కొడుకులంత రోసగాళ్ళు. మడుసులు మంచోళ్ళేగానీ పంతాలు పట్టింపులు ఎక్కువ. రోసం పాసం ఎక్కువ.

వోళ్ళ నాయన సేసే పన్లన్నీ శాదస్తమంటా కొట్టిపారేస్తారు. ఇట్లా మెతక రాజకీయాలు కూడు బెట్టవని వోళ్ళ నమ్మకం. ఇట్టాంటి పరిస్తిలో వున్నిట్టుండి పెద్దిరెడ్డి గుండె అర్టేపేలైపోయి సచ్చిపాయ.

ఆయప్ప అట్ల కాలమై పోయినాడో లేదో ఊర్లో పరిస్తి పూరా మారిపోబట్టె. మంచితనమూ అయికమత్తెమూ అన్నీ ఆయన్తోనేపాయ. కాలీ అయిన పెసిరింటు సీటుకు పోటీ పెరిగె. శ్యానా మంది పెద్దిరెడ్డి పెద్ద కొడుకు బసిరెడ్డి కిచ్చి వారసత్వం నిలపాలంట్రి. ఇంకొందరు అది కుదరదంట్రి. అసీమంటే ఇసీమంట్రి. 'ఎల్లకాలమూ వోళ్ళే వుండాల్నా. ఈతూరి యేరేవోళ్ళుండనీ' అంటా ఉడుం పట్టు బట్టి.

దాంతో ఆ ఊర్లోకీ రాజకీయాలు వచ్చి సేరిపాయ. అప్పుడెప్పుడో నలమహారాజుకతలో ... శనీస్పుడు నలున్ని ఎట్టబట్టాలా అంట కాపిట్టుకో నుండీ, వొగతూరి బయటికేడికో బోయి, కాళ్ళూ సేతులు సరిగ్గా కడుక్కోకుండా అంతప్పురంలోకి వచ్చేసిన నలున్ని జూసి 'అదే మంచి సమీం' అంటా బావించుకోని ఆ రాజును పట్నాడంట. ఏడేడు పద్నాలుగేండ్లు ఉడకాడించి సంపినాడంట.

అట్ల ఆ మాదిరిగా అన్ని దినాలూ వుండుండి పెద్దిరెడ్డి పోతానే రాజకీయాలు వచ్చి సేరిపోయి శనీస్పుడు బట్నట్టు బట్టేశ.

ఆ ఊర్లో అన్నిట్లోను గురిగింజంత వారవతో అట్లా ఇట్లా సమంగా తూగే కుళాయప్పను కొత్తగా ఏర్పాటయిన తెలుగుదేశం పార్టీ వోళ్ళు పట్టేసిరి. తమ పార్టీ తరపన పెసిరింటుగా నిలబెట్రి. ఆ ఊర్లో కుళాయప్పకు బందువర్గం శ్యానా వుండె. శ్యానా ఇండ్లోళ్ళు ఆయప్ప బామర్దులు,

పాలోళ్ళే. అంతకు మించి వాగ కూతుర్ని వూర్లోనే ఇచ్చిండె. అందుకే కుళాయప్ప ధైర్నంగా నిలబడె.

మేమేమీ తక్కువ దినలా అంటా కాంగిరేసోళ్ళూ పెద్దిరెడ్డి కొడుకు బసిరెడ్డిని తమ పార్టీ తరపన నిలబెట్రి. ఇద్దరికీ పోటాపోటీ పెరిగె. బసిరెడ్డికీ ఆ ఊర్లో బలగం బాగానే వుండె. అంతకు మించి కాంగిరేసులో కొందరు పెద్ద నాయకులు అయప్పకు అండదండలందిచ్చిరి. అది గెమనించి తెలుగుదేశమోళ్ళూమేమేం సెడిపోయినామన్నిట్టు కుళాయప్పకు ఎన్నుదన్నుగా నిలబడిరి.

ఇట్ల ఎలచ్చన్ల పున్నెమాంట ముందెన్నడూ లేంది ఆ ఊర్లో రోషాలు పెరిగె. అంతవరకూ లేని కులంకస్మాలం వోళ్ళ మొనుసుల్లోను జొరబడె. పంతాలు పెరిగె, పగలూ పెరిగె, రాజకీయ యిసగాలి పల్లె నావరించేశ.

కుళాయప్పది బసిరెడ్డింటికి కెదురిల్లే. అయప్పకూ ముగ్గురు కొడుకులు. ఇద్దరు కూతుండ్లు. అందరికీ పెండ్లిండ్లయి పోయిండె. ఎన్నికల సమేనికి వోళ్ళ బందుగులంతా ఊర్లోకి దిగేసిరి. ఇట్ల ఈళ్ళ బందుగులూ ఊర్లో దిగిపోయిరి. వాగరికి మించి వాగరు పెచారం మొదులు పెట్రి. ఎవురికి ఎవురూ తీసిపోలా. వోళ్ళ పట్టుదలలు వాగయించీ అట్టా యిట్టా గూడా తగ్గలా ... ఏ సమీంలో ఏం జరిగితిందో తెలీని పరిస్తితి యేర్పడిపాయ. అయినా ఎవురి జాగర్తలో వోళ్లుండ్రి. ఇద్దరి నాయకులిండ్లకూ నాటు బాంబులు దిగె.

కుళాయప్పకు తెలివెక్కువ. అయప్పకు నక్కజిత్తులోడనే మారు పేరు గూడా వుండాదిలే. ఎత్తుకు పై ఎత్తులేసి ఎదుటోళ్ళను సిత్తుజేసే ఇగితి తెలిసినోడు.

బసిరెడ్డి ధైర్నమంతుడే గానీ జిత్తులు, ఎత్తులు ఎరగనోడు. ఎట్టయితేనేం... అక్కడ జనాల్లో కుళాయప్ప కులాభిమానం రెచ్చగొట్టె. బసిరెడ్డికొచ్చే వోట్లన్నీ సీల్చబట్టె. ఇద్దరికీ పోటీ బలంగా సాగె. దొంగ సారాయి కేన్లు కేన్లు దిగె. దుడ్డూ దస్కం, సారాయి మంచి నీళ్ళ మాదిరైపాయ. ఎలచ్చన్‌కు ముందురోజు ఇరుపచ్చాలోళ్ళు బాగా రంపుజేసుకుండ్రి. రగడ లేపుకుండ్రి. రాళ్ళు యేసుకుండ్రి. బండి కూసాల్తో కొట్టుకుండ్రి. తలలు పగలగొట్టుకుండ్రి. ఎట్టయితేనం... కుళాయిప్ప ఎత్తులు జిత్తుల ముందు పెద్దిరెడ్డి మంచితనంగానీ, అంతవరకూ పల్లెకు జేసిన సేవగాని కొడుక్కి ఏ పాటికి పనికి రాకుండా అయిపాయి. కడాకు బసిరెడ్డి ఓడిపాయ.

ఇంక అప్పట్నుంటీ ఆ ఊరు రెండుగా సీలిపాయ. బసిరెడ్డోళ్ళకు కుళాయప్పోళ్ళకు పార్టీ పడిపాయ. ఇరువర్గాలకు 'ఎస్' పార్టీ అయిపాయ. పెతిసిన్న దానికీ కొట్లాడుకోవడం, రంపులు రాగింతాలు జేసుకోవడం కడాకు కొట్టుకోవడం మామూలైపాయ. దీన్ని ఆసరా జేసుకొని రాజకీయ నాయకులు వోళ్ళ తరగాదుల్ని ఇంకా మెప్పుగా సాకి సంతరించి సస్తావుండ్రి.

ఇట్లా కడప జిల్లాలో... ఆ పక్క యాడనోవున్నె కచ్చలు, కార్పణ్యాలు, ముఠా తగాదాలు రాజకీయాలు వున్నెమాంట కొంపలో దూరిన పాము మాదిర్తో ఆ పల్లెలోనూ దూరి పాయ. దాంతో

సిన్నసిన్న తగాదాలకే 'పొడిసేచ్చా, సీల్చేచ్చా' అంటా బెబ్బరించుకునేదీ, అగింతాలు చేసుకునేదీ అల బ్బాటైపోయ. ఆ అలబాటే రానురాను పేణాలు దీసుకునే మేన దారిదీశ.

ఇట్లాంటి పరిస్తిలో .. గాండ్లోళ్ళగానిగిదెగ్గిర తిరిగిన సాట్నే తిరిగేగానిగెద్దు మాదిర్తో తిరిగి తిరిగి కాలం తిక్కరేపతావుండె.

దినాలు గడవనూగడవనూ గవురుమెంటుకు పెసిరింట్లన్నా, సర్పంచులన్నా పూరా లెక్కాజమాలేకుండా అయిపాయ. అందువల్లా పెసిరెంటుపదవి నామ్కేవాస్తేగా మారిపాయ. దానివల్లా కుళాయప్ప కొరిగిందేమీ లేకపాయ. దానికితోడు ఏ అమాశకో, పున్నానికో వొగసూరి తప్ప ఆయప్పకు తన పెసిరెంటు గిరీనే గ్యేవనానికి రాకుండా అయిపాయ. బసిరెడ్డికి మాత్రం ఓడిపోయిన సంగతి నిరంతరాయంగా గుర్తుకొస్తానే వుండె. వొగరావడమేగాదు ఆయిసియం గొంతులో పడిన కరక్కాయ మాదిరి గుండెకాయ కడ్డం పడతానే వుండె. గుండెను గాయం జేస్తానే వుండె.

ఈ మాదిరిగా ఇరు పచ్చాలోళ్ళో వొగర్నొగరు దెబ్బ తీసేదానికి తగిన సమీం కోసరం కండ్లల్లో వత్తులేసుకొని ఎదురు సూస్తా కాపెట్టుకొనుండ్రి.

❖ ❖ ❖ ❖

ఆ సమచ్చరం వానలు బాగనేపడే. అది ఆరుద్రకార్తె. రైతులు సేన్లల్లో దుక్కిదున్ని గింజలిత్తుక్కునే కాలం. ఆ దినం పొద్దన్నే, పొద్దు కరకరా మొలవక ముందే రైతులు మడకల్ని భూజానేసుకొని ఎద్ల పగ్గాల్ను సేతబట్టుకొని సేండ్లు దున్నే దానికి మిడిమేళంగా పోతావుండ్రి. పనుల కాలం గదా! ఊర్లో మొగోళ్ళు శ్యానామటుకు సేన్లల్లోనే వుండ్రి. అందరి మాదిరే... అట్ల బసిరెడ్డింట్లోను, ఇట్ల కుళాయప్ప ఇంట్లోను మొగోళ్ళు ఎవ్వరూ లేరు. అబ్బుటికే వోళ్ళందురూ సేన్లకాడికి ఎళ్ళిపోయిండ్రి.

ఆ సమీంలో ఎదురుబొదురుగా వుండే ఆ రెండు కుటింబరాల ఆడోళ్ళ మద్దెన భలే ఇచ్చిత్త రంగా ఆరంభమాయ కొట్లాట. ఎవురో వొగాయప్ప సేనికాడికి ఎద్దులు తోలుకోనిపోతావుంటే... అందులో వొగ ఎద్దు ఈదిలో బసిరెడ్డి ఇంటి ముందరికల్లా వొగ పేడకడి యేశ. అది గెఃవనించిన కుళాయప్ప పెద్దకోడలు రత్నమ్మ, ఆ రోజు శుక్కరోరం గావడం వల్లా, ఇల్లు అలికే దానికి ఆ పేడ కడిని తీసి సేతల్లో పెట్టుకోని తీసకపోతావుండె. సరిగ్గా ఆ సమీంలోనే అది జూసిన బసిరెడ్డి భారీయ్య ఈరనాగమ్మ "ఏమమ్మా! సూచ్చాండంగానే మా ఇంటి ముందర పేడ కడి ఎత్తకపోతా వుండావే. మరేదగా... యాడున్నె పేడ ఆడనే యేసెయ్యి. అఃః..." అని సేతులు తిప్పుకుంటా ఈదిలో కొచ్చె. ఆ మాటిన్నె రత్నమ్మ మొఖుసు సివుక్కుమనె.

"ఏమమ్మీ! అరగాసు పేడకడికి అట్ల ఇగలపడతావుండావేంది? నీయబ్బగంటు పోయినట్టు". యేటుకు యేటన్నరెత్తు అన్నెట్టు జవాబు సెప్పె.

" ఏమే లమ్మిడీ! మాయబ్బ మాటెత్తుతావ్ యేభ్రాసిముండా... పొరక ఇరిగి పోవును. జాగర్త "

సీరకుచ్చిళ్ళు ఎగజెక్కి, ఎగసెక్కెంగా సాపించ బట్టె ఈరనాగమ్మ. ఎంతయినా కడపకవతలి బిడ్డెగదా. ఆ తెగవ యెక్కడబోతాది?

" ఏమే నీ బడాయి. రంపుకొచ్చుండావ్! ఎవురే లమ్మిడీలు, యేభ్రాసోళ్ళు నువ్వు లమ్మిడీ, నీయమ్మ లమ్మిడీ, నీయత్త లమ్మిడీ.... మీ వంగిశమే లమ్మిడీల వంగిశమే. పోయే లంగిడీ... మీవంచమే యేభ్రాసోళ్ళు వంగిశమే" మనకు సొసంతరం వచ్చిందోలేదో తెలీకపోయినా రత్నమ్మ నోటికి పుల్లు సొసంతరమొచ్చేసి పులారించి పోయింది.

"ఎంతమాటంటివే. నీ అంతుజూచ్చానే. నీ నెత్తర కండ్ల జూచ్చానే " అంటా వొగడుగు ముందుకేశ ఈరనాగమ్మ.

" ఏమే, బలే వొచ్చాండావ్? ఎక్కువ మాట్లాడొద్దు. బొక్కముయ్యే. ఇంక తెరిసినావా సేతల్లో వుండే ప్యాడదీసి మొగానికేసిపోతా "

" ప్యాడతో యేచ్చావ్! యెయ్యేసూచ్చాము. నీ బగిసెంతో యెయ్యే. నిన్ను మాదిగోడెత్తకపోనానీ, నిన్ను మాలోడు సెయ్యా... " గబ్బుగబ్బుగా తిట్టబట్టె ఈరనాగమ్మ.

" ముందెవురే అనింది బసివిదానా. నువ్వు ముందు పొరకతో కొట్టే సూచ్చాము. నీ యబ్బన్ని దిబ్బలో యేసి తొయ్యా. నిన్ను యానోదోడెత్తకపొయ్యి యేట్లో యెయ్యా. నిన్ను కన్నోడు సెయ్యా... " ఇనరాని, అనరాని మాటలనబట్టె రత్నమ్మ.

ఇద్దర్లోను రోసం! పట్టుదల!

వోళ్ళ రంపులాటని ఊర్లో వోళ్ళందురూ వొచ్చిగుంపు సేరిపొయిరి. కుళాయప్ప భారీయ్య ఆదెమ్మ, కోడాలు రత్నమ్మతో కలిసిపోయి ఈరనాగమ్మ మింద రేసుకుక్కలు పడినట్లు పడిరి.

జయరాముడుగోడకు అతక్క పొయ్య భయం భయంగా జూస్తావుండె. పెద్దిరెడ్డి భారీయ్య వరాలమ్మ ఈరనాగమ్మకు సపోర్టుగా వచ్చె. ఇరువర్గాల ఆడోళ్ళుగోదాలోకి దిగిపొయిరి. ఎవురికీ ఎవరూ తగ్గలా. వొగించీ అట్లజగ్గలా. ఈ రనాగమ్మ వోళ్ళను బలంగా ఎదిరించె. అయినా వోళ్ళు తుట్టె కదిలించిన మడిసిని ముసురుకునే పెద్ద పేరీగలు మాదిర్తో ముసురుకుంభ్రి.

రత్నమ్మ, వీరనాగమ్మ జుట్టుపట్టుకోబోయ. కానీ ఆయమ్మతప్పించుకోని రత్నమ్మ జుట్టే పట్టేశ. వొంగదీసి దబదబాంట వొగదెబ్బ గూడా యేసేశ. ఇంగేముండాది? వోళ్ళ రంపు వొరిగెడ్డికంటుకున్నె నిప్పు మాదిరి గుప్పునెగిశ.

ఆడ... రగడ. రాగింతం! ఆడోళ్ళదొమ్మీ... దొబ్బులాట! వోళ్ళు నలుగురు. ఈళ్ళు ఇద్దరు! అది సూస్తావున్నె జయరాముడు, " నేనుగనా ఇంకొంచెం పెద్దోన్నయింటేగనకా ఆదెమ్మను, రత్నమ్మను ఈడ్చి ఈడ్చి తన్నిందు సూసుకో " అనుకుంటా వుండె. ఆ దొమ్మీలో ఈరనాగమ్మ వరాలమ్మ బాగా దెబ్బలు తిని.

అది సూడలేక 'నీయమ్మా, నీయక్కా' అంటా జయరాముడు రత్నమ్మను, ఆదెమ్మను ఎనకనించి తన్నబట్టె ... వోళ్ళు వోన్ని వోళ్లోళ్ళతో కలేసి తన్నబట్రి. ఈరనాగమ్మ గుడ్డలుసినిగి సిర్లాలు పర్లాలైపోయిండె. వరాలమ్మ మొగాన గీరకపోయి నెత్తర కమ్మకొస్తావుండె.

ఇంకా సూస్తావుంటే బాగలా అనుకోని ఆడసేరిపోయిన అమ్మలక్కలు " మీ మొగోళ్ళు వచ్చి ఒతర్వాత నేయంజేసుకోండి... పోండి " అంటా ఇరుపచ్చాల వోళ్ళను ఇడదీసి ఇండ్లకు పంపించేసిరి. ఆ దినం అసరసందేళకంతా సేన్లల్లోనించీ మొగోళ్ళు ఇండ్లకు సేరుకుండ్రి. ఆడోళ్ళు సెప్పాల్సిందంతా సెప్పేసిరి. జరగాల్సిందే జరగబట్టె. ఆ రేత్తిరి మల్లా పెద్ద గలాటా జరిగె.

బసిరెడ్డోళ్ళు ఈదిలో నిలబడి కుళాయప్పోళ్ళను బగిశీనంగా తిట్టబట్రి.

" మీ అంతు సూచ్చారా కొడుకుల్లారా " అంటా తొడగొట్టి పిల్చిరి.

" మీ పించమనిసేచ్చాంరా. మీ వంగిశం నిర్వంగిశం సేసేచ్చాంరా. పొడిసేచ్చాంరా. సీల్చేచ్చాం. వొగొగన్ని తుండ్లు తుండ్లుగా కత్తరించేచ్చాంరా" అంటా ఈడెగిరి ఆడదూకిరి.

కుళాయప్ప కొడుకులూ రోసంపాసం వున్నోళ్ళే. మొలతాళ్ళు గట్టిన మొనగోళ్ళే. అంతకు మించి ఉప్పూపులుపూ తింటా వున్నోళ్ళే. అందుగ్గాబట్టే వోళ్ళూ ఈదల్లోకొచ్చేసి సొక్కాయ లెకదీసిరి, పంచెలు బిగించిరి.

" రండ్రాసూసుకుందారి, యభిసారికొడుకుల్లారా, నిలువునా నరికి పారేచ్చాం. మీ నెత్తర కండ్ల జూచ్చాం. మీ అంతు జూడందే నిద్దర పోమురా..." అంటా పెద్ద పటాటోపం జూపించిరి.

ఇట్ల ఇరు వర్గాలోళ్ళు వొగర్నొగరు గబ్బుకూతలు కూసుకుంటాకత్తులు, కటార్లు ఎత్తుకునే సమేనికి " వొరివొరే ఇది అట్ట దిరిగి ఇట్ట దిరిగి తుకంమించి పోయేట్టుగా వుండాదే. ఇప్పుడడ్డ పడకపోతే కతసెడిపోయేట్టుగా వుండాదే " అనుకుంటా కొందురు పెద్ద మడుసులు ముందు కొచ్చిరి. " నాయం ఎట్టుంటే అట్టా మాట్లాడుకోండి. రేత్తిరికి మద్దిస్తం జేసి నాయం చేసుకోండి పోండి " అంటా సర్దుబాటు చేసి పంపించేసిరి.

ఆ రోజు రేత్తిరి రాగిసెట్టు కిందుండే రచ్చబండ మింద మద్దిస్తం జరిగె. ఇంటికో మనిషి లెక్కన పొయ్యి అక్కడ కూర్చుండ్రి. మిగిలినోళ్ళు వోళ్ళోళ్ళ ఇండ్ల ముందర కూసొని 'మద్దిస్తం'లో జరిగతా వుండే ఇసియాల్ను ఇనబట్రి. ఆ మద్దిస్తంలో సాచ్చికాల్ని ఇసార్న సేసిం తర్వాత ఇద్దరాడోళ్ళను నలుగురు ఆడోళ్ళు కలిసి కొట్నందుగ్గాను కుళాయప్ప ఆడోళ్ళది వొగ తప్పుగాను, ఈదిలో ఎవురి గొడ్డో యేసిన పేడకడి కోసరం అంత ఆగింతం జేసి, ముందుగా రత్నమ్మ జుట్టుపట్టుకోని కొట్నందుకు ఈరనాగమ్మని రెండు తప్పులుగాను నిర్నయించి అందులో వొగ తప్పుకు వొగ తప్పు చెల్లుపోగా మిగిలిన వొగ తప్పుకు యాభై రూపాయల్ని ఈరనాగమ్మ తప్పుగా కట్టాలని పెద్దలు నిశ్చయంజేసిరి.

అదే రాగిసెట్టు కింద ... పెద్దలు కూసోని వున్న తావులో కూచ్చోని ఎన్నో నాయాలు జేసిన తమ తండ్రికి బదులుగా, ఎవురో యేసిన తప్పు కట్టి, తామంతా దోసులు మాదిరిగా నిలబడింది

బసిరెడ్డి కుటింబరానికి శ్యానా అగుమానంగా అనిపిచ్చింది, దాంతో ఊర్లో వోళ్ళను ఏమీ అనలేక కుళాయప్ప కుటింబరంపైన పగ పెంచుకుంౘ్రి. అంతకంతా కసి తీర్చుకునే దానికి సరయిన సమీంకోసరం ఎదురు సూస్తావుంౘ్రి. ఈ సంఘటన జరిగిన ఓ నెల దినాలకు రెండు కుటింబరాల మద్దెన ఇంగోగలాటా జరిగె.

బసిరెడ్డి గెవిని దెగ్గిర కటవకాడ సేన్లో ముందు మడక దున్నతా వుండె. ఆ యెనక మడక నరిసిమ్మారెడ్డి దున్నతా వుండె. సుధాకర్రెడ్డి ఇంకో సేన్లో ఇరసాలు దున్నతా వుండె.

కుళాయప్పోళ్ళు ఎప్పుడో పొద్దనే ఎరువు తోలకొచ్చిన ఎద్దల బండి నడిసేన్లో అట్టే బడుండె. దానిశ్రానికుండె ఆకులకు వొగెద్దును, ముక్కెనకొగ ఎద్దును కట్టే సింౘ్రి. ఎరువు పోసేది అయిపోయినాంక రత్నమ్మ సెత్తయేరేదాంట్లో మునిగిపోయిండె. కుళాయప్ప సేన్లో పైకి తేలిన రాళ్ళను దెచ్చి గెనింమింద యేస్తావుండె. ఆ దినం కుళాయప్ప కొడుకులు వూరికవతల ఇంగోసేన్లో మడకలు గట్టి దుక్కిదున్నే దానికి పొయ్యింౘ్రి. మిగిలిన ఆడోళ్ళు ఇంటి దెగ్గిరే పంజేసుకుంటా వుంౘ్రి.

గెనిం మింద రాళ్ళు పొందేస్తావున్న కుళాయప్ప వొగిసు అరవై పదులు దాటింటింది. ఆయప్పకు కంటిసూపు కూడా తక్కువే. ఆ కార్నంగా గెనింపైన పెడతావున్నే రాళ్ళు కొంచెం పక్క సేన్లోకల్లా జార్నాయి. ఆ యిసియం అయప్పగెఁవనించనేలా. కానీ ఆడనే కొంచెం దూరంలో సేన్లో సెత్త యారతావున్నె సుదాకరుడుగెఁవనించి కుళాయప్ప మిందికి కొట్టాటకుపాయ.

“వొరే ముసిలోడా! నీకేం పొయ్యే కాలంరా కొంతేగాలం నా కొడకా. మేమంతా చూచ్చాండం గానే రాళ్ళు మా గెనింకిందికల్లా యేసేచ్చాండావే. పక్క సేను నీ యమ్మా మింద గాందనుకుంటివా. తియ్రా ముందు” అంటా ఇగలబడె.

“ఇంకా పెండ్లిగూడా కాలే. అటిమంటి పిల్లనాకొడుకు వొగిసు కూడా సూడకుండా వొరే అంటాడా...” వొగ్గెడివు సేపు మొనుసులోనే మదనపడె కుళాయప్ప.

అయప్ప బగిసి దెబ్బతినె. ఆత్మాభిమానంగాలి కెగిరిపాయ. ఆయప్ప పెసిరింటుగిరీ, పురసత్తా అన్నీ ఉప్పురాతికి పనికి రాకండా అయిపాయ. అందుకే రోసం పొడసకొచ్చేశ ముసిలోడికి.

“ఏమిరా తలగెరివి నా కొడకా! అంత ఉప్పళంగా ఎగిరి పడతావుండావు. అన్నేకారి నా కొడకా, నోరు కొంచెం తగ్గించు. లేకుంటే మరేద సెడి పోవును” పైకి లేసి నిలబడి అనె.

“ఏంజేచ్చావురా ముసిల్నా కొడకా, కొట్నానంటే పొండ్లు ముప్పయి రెండూ రాలికింద పడతాయి.” గిచ్చి రంపుకు బిల్చినట్టన్నాడు సుధాకరుడు.

ఇంక ఆపుకోలేక పాయ కుళాయప్ప. “కొత్రా సూచ్చాం. పిల్ల నా కొడకా. నా కండ్ల ముందర పుట్నోడివి. నన్నే కొట్నొచ్చావా? నీ పెగ్గెంతో తేల్చేచ్చా. కొత్రా జూచ్చాము” మిందిమిందికిపాయ.

“ఈ పొద్దేందో గలాటా లేసేట్టుగా వుండాది గదరా భగమంతుడా” అనుకంటా ఆడికి

పరుగున వొచ్చి "యారకతినే నా బట్టా! మొల్తాడు గట్టిన మొగోడివే అయితే కొట్రా సూచ్చా ..." అంటా మామకు సపోర్టుగా వచ్చె రత్నమ్మ.

"అప్పుడు గాదే లంజా! మా వొదిన్ను వొంటి దాన్ని జేసి కొట్టింది. ఇప్పుడు మిమ్మల్ని కొడితే యేం జేచ్చారే. మీరేగొట్టి మళ్ళా మాకే తప్పేపిచ్చారా ఇబ్బుడు నేను తంతానే. యే నా కొడుకు అడ్డ మొచ్చాడో జూచ్చా..." అంటా సుధాకరుడు రెచ్చిపోయి కుళాయప్ప జుట్టు పట్టుకోని గబగబ రెండు గుద్దులేసేశ.

ఉన్నిట్టుండి సుధాకరుడు కొట్టేగుందికి బిత్తర పొయిరి మామా కోడండ్లు. ఇద్దరూ కలబడి సుధాకరున్ని బట్టుకోని కొట్టబట్రి. వోళ్ళ ధాటికి నిలవరించుకోలేక సుధాకరుడు తూలి ఎన్నిక్కిబడె.

దూరంనించె అది గెవనించిన బసిరెడ్డి మడక ఆపేసి "వొరే నరిసిమ్మా! సిన్నోన్ని సంపేచ్చాండారు రంఢ్రేయ్..." అంటా గెట్టిగా అరుసుకుంటా ఆడికి పరిగెత్తబట్టె. ఆ అరుపు ఇనుకోని నరిసిమ్ములూ ఆడికి పరిగెత్తకొచ్చేశ. ఇద్దరి సేతల్లోను కోలకట్టెలు అట్లే వుండె.

వోళ్ళు వచ్చే లోపల సుధాకరుడు పైకిలేసి తెపరాయించుకోని రత్నమ్మ జుట్టు బట్టుకోని ఎనుకూ ముందు సూడకుండా రెండు గుద్దులు గుద్దేశ.

"ఓయమ్మల్లా! ఈ ముండ నా బట్ట నన్ను సంపేశ గదరా తండ్రీ ... వొరి దేముడో" అంటా అరస్తానే ఆగింతం జేస్తానే ఎదిరిస్తా వుండె రత్నమ్మ.

ఇంత లోపల ఆడికి సేరుకున్న బసిరెడ్డి, నరిసిమ్ములు కుళాయప్పను పట్టుకోని సెడాబడా కొట్టేసిరి. కుక్కను గొట్టినట్టు కొట్టేసిరి. సస్తాడో బతకతాడో అని గూడా సూడలే. ఆ దెబ్బలకు ముసిలోడు కోడిపిల్ల సుట్టక పోయినట్టు సుట్టకపాయ. నోటి మాట లేకండా నేల పైన పడిపాయ. దాంతో ముసిలోడు సచ్చినాడనుకోని ఆ ముగ్గురు అన్నించీ పరిగెత్తిరి, పరార్పైపోయిరి. సుట్ట పక్కలా ఎవ్వరూ లేరు. వొగరిద్దరున్న మనకెందు కొచ్చిందిలే అంట ఏమీ ఎరగనట్లే వుండిపొయిరి. రత్నమ్మకు ఏం జేయాలో తెలీలా కానీ ఏదో వొగిటి సెయ్యాల. అదీ బిరీన సెయ్యాల. ఏం జేయాల అంట వొగ్గెడివు యోచ్చన జేసిం తర్వాత ఆ యమ్మ కేందో శగితి పూన్నిట్టయిపోయి, సీరుకుచ్చిళ్ళనే ఎగదీసి గోసీ పెట్టుకుండె. గబగబ ఎద్దుల్ని ఇప్పి, పూన్చి కాడిమాను మెడల మింద బెట్టి పలుపులు బిగించె. ఆమింద కుళాయప్పను, ఎత్తి బండిలో ఎయ్యాలనిజూశ. కానీ అది సాధ్యపడలా. యిట్లా ఎట్లా చూశ. దూరంగా వొగతెలిసిన మనిస్తా కనిపిచ్చె. "ఓన్నో ... యిట్లరాన్నా" అంటాపిల్చె.

"ఎమ్మా" అంటా వొచ్చె అయప్ప. జరిగింది చెప్పి "ఆసుపత్రికి చేర్చాలన్నా" అనె రత్నమ్మ.

అయప్ప ముసిలోడి సంకల్లో చేతులేసి పైకి లేపె. రత్నమ్మ కాళ్ళు పట్టుకుండె. యిద్దరూ ముసిలోన్ని బండ్లోయేసిరి. రత్నమ్మ బండిలో కూసుండె. ఆయప్ప నొగల మిందకూసుండె. గెంటలో బండి రాసీడు ఆసుపత్రికి చేరిపాయ. పరిస్తిగెవనించిన కాంపొండ్రు, నర్సులు వచ్చి సాయంబట్రి. డాక్టరు గబగబా వచ్చి కుళాయప్పను పరీచ్చజేసి జూశ. కానీ నాభం లేకపాయ.

ఆయప్ప మద్దెలో ఎప్పుడో సచ్చిపోయిండె. ఈ ఇసయం తెలిసి కుళాయప్ప కొడుకులు, కూతుండ్లు, అల్లుండ్లు అందురూ ఆసుపత్రికి సేరుకుండ్రి. జరిగిన ఆపితికి కుతకుత ఉడికిపాయిరి. పోలీసు కేసు పెట్రి. వోళ్ళ పార్టీ రాజకీయనాయకులూ రంగంలో దిగిరి. పోస్టుమార్టం జరిగె, కేసు బలమైపాయ.

కుళాయప్ప పీనిగను పల్లెకు దీసకొచ్చిరి. పల్లె ఆలగోలైపాయ. శోక సమద్దరమైపాయ.

కుళాయప్ప కాలమైపోయిన పదకొండో రోజు దినాలు జరిగె. ఆ దినాలకు బందుగులందరు వచ్చిండ్రి.

కర్మాంతరం తీరిం తర్వాత మళ్ళా ఎవురిదారి వోళ్ళుబట్రి. కానీ అల్లుండ్లు, దాయాదులు మాత్రం ఆడనే నిల్చిపాయిరి. ఆనాటి రేత్తిరి తలుపులన్నీ బిడాయించుకోని, అందురూ పూజ గదిలో కూసున్నారు. నటింట్లోదేముడి పటంతో బాటు కుళాయప్ప పోటాయి పెట్రి. వాటికి ముందర ఎదురుగా సలిబిండి ముద్ద పెట్టి దాని మద్దెలో వాగ పొడుగూటి బిచ్చువాకత్తిని తల్లకిందులుగా గుచ్చిరి. ఆమింద వొగొగరు వొగొగ పసుపుతాడు సేతబట్టుకుండ్రి. తొట్టతొలీత కుళాయప్ప పెద్ద కొడుకు ముందుకొచ్చి 'నాయనా! నిన్ను సంపిన పెద్దిరెడ్డి కొడుకుల్ని అందర్నీ సంపి, వోళ్ళ వొంగిశం నిర్వంగిశం సేసిందాకా వదలము. అట్టా సెయ్యకపోతిమో మేం నీ బిడ్డలమే గాదనుకో. ఈ పెత్తిగ్గిన నెరవేర్చతామని, యిద్దో, ఈ కత్తిమింద పవాణకం చేసి 'కచ్చి' కడతా వుండాం'' అంటా పసుపు తాడును ఆ కత్తికి కట్టె.

అనాక ఆయప్ప తమ్ముడు, ఇద్దరు అల్లుండ్లు, ఇంకా దాయాదులు అదే మాదిరి పవాణకం జేసి 'కక్షరేఖ' కట్రి.

ఆయిదంతో వోళ్ళు పెద్దిరెడ్డి కుటింబరం పైన కచ్చికట్రి. ఆ కసి తీర్సుకునే దానికి తగిన సమీం కోసరం సూస్తా వుండ్రి.

❖ ❖ ❖ ❖

రైతులందురూ సేన్లల్లో ఇత్తనాలు యేసేసిరి. అయి భూమమ్మ కడుపును సీల్సుకోనొచ్చినట్టు, మొలకలేసినాయి ... సూస్తాండంగానే ఆ మొలకలు పచ్చ గరుగును మిందేసుకోని ఏలుడు పొడుగు పెరిగె. కానీ పెద్దిరెడ్డి సేన్లల్లో మాత్తరం ఇంగా గింజ పడలా, దున్నిండే దుక్కి దున్నినట్లే వుండె. వొగ అయిలప్పరెడ్డి తప్ప అందురూ పరారీలో వుండ్రి. ఎప్పుడో, అందురూ నిద్దర్లు పోయినాక, ఎవురికీ కానకుండా, వొగొగరుగా ఇంటికొచ్చి, ఇంట్లో వోళ్ళను జూసి, కావాల్సిన దుడ్డు, గుడ్డలు తీసక పోతా వుండ్రి. ఇంగో పక్కన బెయిలు కోసరం యత్తనం జేస్తానే వుండ్రి. కేసుమాత్తరం నడస్తానే వుండె. ఈళ్ళకూ రాజకీయ నాయకుల అండదండలు అందతానే వుండె. వొగ మాటలో సెప్పాలంటే బసిరెడ్డోళ్ళ కంటే, ఆ పార్టీ వోళ్ళకే అది శ్యానా ప్రిస్టేజీగా మారిపాయ.

పెద్దిరెడ్డి అల్లుడు బాగా వున్నోడు. పేరు గుడిబండగురువారెడ్డి. గుడిబండ గురువారెడ్డి అంటే ఆ మండలానికే గొప్ప పేరు గలిగుండె. ఆయప్పకు అయిద్రాబాదులో గూడా శ్యానామంది నాయకులయినోళ్ళు నేస్తులుగా ఉండ్రి. ఆయప్ప తన పరపతినంతా వుపయోగించి, బామ్మర్దులకు బెయిలు తీసుకోనొచ్చేశ. దాంతో బసిరెడ్డోళ్ళు అగ్గినాత వాసం ముగించుకుండ్రి. పరారీలో నుంచీ ఇంటికి తిరిగొచ్చిరి. ఆలస్యింగానైనా తమ సేన్లల్లో ఇత్తనాలు యేసుకుండ్రి.

తమ తండ్రిని సంపినా మళ్ళా ఊరుసేరిపోయిందే గాంక, ధైర్నంగా తిరగతా వుండే బసిరెడ్డోళ్ళను జూసే గుందికి కుళ్ళాయప్ప కొడుకులు లోలోపల్నే బుసలు కొడతావుండ్రి. అయినా బూడిద గప్పిన నిప్పు కండ మాదిర్తో ... గొమ్ము నుండి పొయిరి. ఇట్లా కొన్ని నెలలు గడిసిపాయ. ఇంక ఈళ్ళేమీ చేసుకోలేర్లే అనే ధీమా, తెగవ బసిరెడ్డోళ్ళల్లో వచ్చేశ.

వొగదినం పొద్దు పాయినాంకా బసిరెడ్డి సేనికాడి నించీ వొంటిగా తిరిగి ఇంటికొస్తావుండె. పొద్దు గూట్లోపడి అప్పుడే శ్యానా సేపాయ. ఊరి గెవిని కాడుండే కానగల కానలో అడుగుబెట్నాడు. ఆ సుట్టపక్కలా యాడా మడుసుల జాడే లేదు. ఆ కానగ సెట్లల్లో నాలుగు కండ్లు ఆయప్పనే యముడి మాదిర్తో సూస్తా వుండాయన్నె సంగతి బసిరెడ్డి పసిగట్టలా. ఆ సెట్లల్లో ఏందో అలికిడాయె. ఉన్నిట్టుండి ఆయప్ప కాళ్ళు నిల్చిపాయ. సుట్టకారం వొగతూరి జూశ బసిరెడ్డి ... అతని సుట్టకారం ఎత్తుంగవుండే కానగ సెట్లు ... వాటి నీడలు యుద్ధ రంగంలో శత్రువుల మింద ప్రయోగించిండే రాచ్చసిమాయ మాదిరి అనిపించె. 'గీ' యంటా అరస్తా వుండే సిమట్ల సద్దు 'ఓ' అంటామోరస్తావుండె. వొగ్గెడివు ఆయప్ప మొనుసు ఏదో కీడు శంకించె.

"ఆఁ ... అంతా నా గిలిగానీ ... గిలెక్కవా? పులెక్కవా? అంటే గిలే ఎక్కువ" అనుకోని తనకు తానే జవాబు సెప్పుకుండె. మళ్ళా ధైర్నం దెచ్చుకోని వొగడుగు ముందు కేశ. అంతే! పెళపెళాంట కానగ కొమ్మలిరిగె. ఏవో కొన్ని ఆకారాలు ఉప్పళంగా వచ్చి మిందబడె. ఏం జరగతా వుండాదో తెలుసుకునే లోపలే అంతా జరిగిపాయ. ఆ సెట్ల కొమ్మల్లోనించీ ఎవురో కొందురు, కత్తుల్తో, గొడ్డన్లతో మిందబడి ఎనుకూముందు జూడకుండానే బసిరెడ్డిని నిలువునా నరికేసిరి. మొదలు తెగ్గొట్టిన సెట్టు మాదిరి నిలబడినోడు నిలబడినట్టే, నిట్ట నిలవనా కుప్పమాదిరి కూలి పాయ బసిరెడ్డి.

❖ ❖ ❖ ❖

బసిరెడ్డి ఎంత సేపుటికీ ఇల్లు సేరకపాయేగుందికి, అనమానపడిన ఆయప్ప తమ్ముళ్ళు తారాడుకుంటా పొయిరి. ఆడ తారాడి ఈడ తారాడి కట్టకడాకు కానగల కానలో పీనిగిని కనుక్కుండ్రి. వాళ్ళ కడుపులు భగ్గున మండె. పీనిగిను గుడ్డల్తో మూటకట్టుకోని మోసకొచ్చిరి. ఊరంతా బీభత్సంగా మారిపాయ. వొగ రణరంగమే అయిపాయ. "నాయాండ్లాలా ... రాండ్రా! మిమ్మల్ని నడీదిలో నరికేయకపోతే మేం మా యబ్బకే పుట్టలేదను కుంటాం ... రండ్రా. రేయ్!"

బసిరెడ్డి తమ్ముళ్ళు తొడలు గొట్టి సవాల్ జేసిరి.

ఊహూఁ ... కుళాయప్ప ఇంట్లో నించీ ఎటువంటి ఎదురు సవాలు గానీ, జవాబు గానీ రాలా. ముందు జాగ్రత్త కోసరం తెచ్చుకోనున్న బాంబుల్ని కుళాయప్ప ఇంటిమింద యేసిరి. అయప్ప అల్లునింటి మిందా యేసిరి. అయినా ఆ ఇండ్లల్లోనించీ ఎవురుగానీ బయటికి రాలా. ఊర్లో జనాలు అదలిపొయిరి. బీతు పట్టుకొని తలుపులు బిడాయించుకుంద్రి. తమ ఇండ్లపైనా యాడబాంబులు పడతాయోనంట వణికి పోతా పేణాలు అరసేతుల్లో బెట్టుకోని బతుకు జీవుడా అని ... బిక్కుబిక్కు మంటా గడప పట్రి. ఇట్టాటి వాతావర్నంలోనే ఆ రేత్తిరి తెల్లారె. పోలీసులొచ్చిరి. కేసు ఆరంబించిరి. బసిరెడ్డి తమ్ముళ్ళిచ్చిండే కంప్లెయింటు ఆధారంగా పోలీసులు కుళాయప్ప కొడుకుల్ని అరెస్టు జేసేదానికొచ్చిరి. కానీ ఇంట్లో ఎవ్వరూ లేరు. వొగ ముసిల్ది తప్పితే వొగ నలుసుగూడా ఇంట్లోలా. కుళాయప్ప కొడుకులిద్దురూ అయిదు రోజులకు ముందే ఇస్కూటర్లో బోతావుంటే ఆపితయిందని రాసీడు అసుపత్రిలో సేరి, కాళ్ళు సేతులు కట్లుగట్టుకోని, కదల్లేని పరిస్తిలో బెడ్లమిందున్నిట్టు తెలిశ. దాంతో పోలీసులు ఏమీ సెయ్యలాక ఎనిక్కి తిరిగి పోయిరి. ఆ మాదిరిగా కుళాయప్ప కొడుకులు ఆ కేసు నించీ తెలివిగా తప్పించుకుంద్రి.

ఇంక సేసేదిలేక బసిరెడ్డి తమ్ముళ్ళు, పీనిగిని దెచ్చి దానంజేసి ఇంటికొచ్చి ఆ రేత్తిరే నట్టింట్లో కత్తిపెట్టి 'కచ్చ' పెట్రి. అందురూ కుళాయప్ప వొంగిశాన్ని నిర్వంగిశం సేస్తామంటా పెతిగ్గినలు పలుక్కుంద్రి. పసుపు తాళ్ళతో కత్తికి కంకణాలు గట్రి. కచ్చదారాలు నిలిపిరి. ఈ తంతంతా అల్లుడు గుడిబండ గురవారెడ్డే నడిపె. బసిరెడ్డి భారీయ్య ఈరనాగమ్మ " నా మొగున్ని సంపిన ఆ కుళాయప్ప కోడాండ్లు అందురూ వరసగా ముండమోసిందాంకా నేనూ ముండమొయ్యను, బొట్టూగాజులు తియ్యను " అంటా శపతం జేసె.

ఇట్ల ఆరెండు కుటింబరాలు కచ్చ, పెట్టుకోవడంతో ఆ ఊరి పరిస్తి పూరా మారిపాయ. ఆ ఊర్లో రోంత కలిగిన కుటుంబరాలు ఆ రెండే గాబట్టి ఆ ఊరిజనాలు రెండు పచ్చాలుగా సీలిపొయిరి. కొందురు కుళాయప్ప జట్లో సేరిపోతే, ఇంకొందురు బసిరెడ్డోళ్ళ జట్లో సేరిపొయిరి. ఈతూరి నాయకులు పత్తెచ్చంగానే గోదాలోకి దిగిరి. ఇద్దరినీ పందెంకోళ్ళను జేసి, కత్తులుగట్టి, తలలు తీడి వద్రిలి. అమాదిరిగనే పెసిరెంటు ఎలచ్చన్లో తాంబూలాలు బెట్రి. తన్నుకోని వొగర్నొగరు నరుక్కునే పరిస్తికిదెచ్చిరి. రానురాను పెతి ఇంట్లోను బాంబులు సేరిపోబట్టె. యాట కొడవండ్లు, బిచ్చవాలు, బరిసెలు, గొడ్డండ్లు పదునెక్కె. వొగర్నొగరు సంపుకునే దానికి వోల్లోళ్ళకొరముట్లు వోళ్ళు నూరుకోబట్రి. మనం బతకాలన్నా బామాలన్నా, బతికి బట్టకట్టాలన్నా శత్రువుల్ను సంపక తప్పదన్న పరిస్తిబలమైపాయ. ఎప్పుడు ఎవునికి మూడుతుందోననే భయ్యం! బీతు! ఈ బాధ భరించలేక అట్లాఇట్లా కానోళ్ళు కొందురు ఆస్తిపాస్తుల్ని అమ్ముకోని, ఇండ్లువాకిండ్లు వదులుకోని, తిరప్తి, మదనపల్లి మంటి టవున్లకు పోబట్రి. ఆడయేవో యాపారాలు ఆరంబించిరి. ఎట్టయితేనేమి? ఈ పగల్తో పట్టింపుల్తో ఊర్లో యొగసాయం నిల్చిపాయ. ఎక్కడి సేద్యాలు

అక్కన్నే నిల్చిపాయ. భూములు బీళ్ళుగా మారిపాయ. ఇట్లాంటి పరిస్తిలో కుళాయప్ప కొడుకులు సుమారిగా రెండునెల్ల తర్వాత ఆసిపత్తిరినించీ తిరిగి ఇంటికొచ్చిరి. ఆ యిదంగా ఆ కేసునించీ తమను కడతేర్చిన డాకట్రుకు, రాజకీయ నాయకులుకు దుడ్లు కుమ్మరించిరి. కానీ వోళ్ళు ఆసపత్తిరినించీ డిస్‌చార్జీ అయ్యి వచ్చిన వారానికల్లా వోళ్ళను కేసునించీ కాపాడిన రాసీదు డాకట్రు ఖూనీ అయిపాయ. ఆపంజేసింది బసిరెడ్డి తమ్ముళ్ళేనన్న సత్తెం కుళాయప్ప కొడుకులు యట్నో పసిగట్టేసిరి. ఇట్టా కొన్ని దినాలు గడిసిపాయ. సేండ్లల్లో యేసిండే సెనిగె తీగెలు వడుపుకునే దానికి సిద్దంగా వుండె. సెట్లు పీక్కునే దానికి తగినట్టుగా వానగూడా బడె. సెనిగిసెట్లు పెరికేవోళ్ళు పెరకబట్రి. నేలతడి దినదినానికి ఇంకిపోతా పంటతల్లి వడిబరువెక్కతావుండె. సుట్టుపక్కల రైతులు సేన్లల్లో శనిగె తీగెలు పీకిపీకి కుప్పలు పెడతా వుండ్రి.

బసిరెడ్డి తమ్ముళ్ళు గూడా సెనిగిసెట్లు పెరికే దానికి మల్లుకుండ్రి. ముందుగా సెనిగి సాళ్ళు మడకతో దున్నిరి. పైకి లేసిన శనిగి తీగెల్ని కూలీల సాయంతో ఏరేరి వొగతావన సేరస్తా వుండ్రి. ఆడోళ్ళు సెట్ల కువ్వల దెగ్గిర కూసోని సెట్లల్లో నించీ కాయలు ఇడిపిస్తా, ఇడిపించిన కాయల్ని కుప్ప పోస్తావుండ్రి. అట్ల కుప్ప పోసిన కాయల్ను కొందురు బండికిపోసి ఇంటికి జేరుస్తావుండ్రి. ఇల్లు జేరిన కాయల్ని ఈరనాగమ్మ ఇంట్లోనే వుండి మిద్దెపైకి పోయిస్తావుండె. మిద్దెపైన సేరిన కాయలు ఎండకు ఎండతావుండె. పక్కసేన్లో కుళాయప్ప కొడుకులు అదే పన్లో మునిగిండ్రి. ఆ పక్క సేన్లో బసిరెడ్డి కుటింబరం, ఈ పక్క కుళాయప్ప కుటింబరం... ఇద్దరూ ఎవురి పన్లో వోళ్ళు పీకల్దాంకా మునిగి పొయ్యిండ్రి. ఇంతలో బసిరెడ్డోళ్ళ సేన్లో... బండి నొగలకు కట్టేసిన రెండెద్దుల్లో వొగెద్దు ఇడిపించుకోని పొయ్యి, మేస్తా మేస్తా కుళాయప్ప సేన్లో బడె. ఆ పాపిస్టిగొడ్డు, పడిందే ఆలిస్సిం... కొండ్రెసాలళ్ళో పెరిగిండేకంది సెట్లను, జొన్న కర్రల్ను ఆవురావురు మంటా మేయబట్టె. అది సూసిన కుళాయప్ప కొడుకులు ఉగ్రులై పోయి ఊగిపోయిరి.

" మాపైకి గొడ్లను గూడా తోలేసినారేంరా ముండా కొడుకుల్లాలా " అంటా సాపించబట్రి.

" వోళ్ళకంటే సిగ్గూ సెరమూలా... అన్నేగారిగొడ్డా... నీకన్నా ఇంగితం లేదంట్నే. నీకు దూముదగలా... నిన్ను సాకినోళ్ళ నెత్తకపొయ్యి కానగల కాన్లో పూడ్సా... " అంటా రత్నమ్మ వొంగివొంగి రాళ్ళు సేతుల్లోకి తీసుకోని బీరిబీరి ఎద్దుపైనేస్తా అగుమానంగా తిట్టబట్టె.

నిజానికి కావాలని గొడ్డును సేన్లోకి తోల్లా. తప్పొయ్యి, ఇడిపించుకోని సేన్లో పడింది. ఇరుగూపొరుగూ అన్నాక అట్టాంటివి తప్పవుగదా. బసిరెడ్డి తమ్ముళ్ళు అదే సెప్పినారు. కానీ వోళ్ళు అదేదీ ఇనిపించుకోలా.

" ఈ మాదిరిగానే వొగప్పుడు మా నాయన్ను సంపేచ్చిరి. ఇబ్బుడు రండ్రా.. వొగనొగన్ని పొడిసేచ్చాం. రండ్రా సూసుకుందారి". కుళాయప్ప కొడుకులు ముందుకు దూంకిరి.

" మొన్నకు మొన్న దేముడంటి మాయన్నను పొట్న బెట్టుకుంట్రి. మీ నాయన్నే గాదురా... మిమ్మల్ని నరికేసి, ఈ సేన్లకు పొలి సల్లేచ్చాం. రండ్రా". బసిరెడ్డి తమ్ముళ్ళు జబ్బలు జర్సిరి.

ఇరుపక్కలోళ్ళు వొగరిమింద ఇంగొకరు జొరబడిరి. ఒగొర్నొగరు కలబడుకుంట్రి. జుట్లుజుట్లు పట్టుకుంట్రి. కత్తులు కత్తులు దూసుకుంట్రి. వొగర్నొగరు నరుక్కుంట్రి.

బసిరెడ్డి ఖూనీతో పగ పెంచుకున్నె పెద్దిరెడ్డి కొడుకులు కుళాయప్ప కొడుకుల్నిద్దర్నీ నిలువునా నరికేసిరి. అడ్డమొచ్చిన రత్నమ్మను అడ్డంగా నరికేసి దీనికంతాకార్నం ఇదేనంటా ముక్కలు ముక్కలు జేసిరి. కండమొండేలు జేసిరి. తునకలు తునకలు జేసిరి. అది సూసిన ఆ సుట్టుపక్కల సేన్లల్లో పంజేస్తావున్న కుళాయప్ప బందుగులు, వర్గీయులు ఉరుకులు పరుగులు మిందొచ్చి, బసిరెడ్డి తమ్ముల్ని ముగ్గుర్ని నరికేసిరి. వొగ్గెడివులో, కండ్లుమూసి తెరిసే లోపల్నే అంతా జరిగిపాయ. పీనిగిల పెంట్లైపాయ ఆ గోరం సూసి భరించలాక ఈరనాగమ్మ కత్తితో పొడుసుకోని అక్కడికక్కడే సచ్చిపాయ. మల్లా ఊరు అల్లకల్లోలమై పాయ. పోలీసులు దిగిరి. కొందుర్ని అరెస్టుజేసిరి. ఊర్లో వొన్‌పార్టీపోరు సెక్సను పెట్రి.

అయినా కుళాయప్ప అల్లుళ్ళు బసిరెడ్డింట్లో మిగిలిండే పెద్దిరెడ్డి భారియ్య వరాలమ్మను, జయరామరెడ్ని గూడా సంపేసి వోళ్ళ వంగిశం నిర్వంగిశం సేసేస్తామని ఊర్లో ఆడాఈడా కనిపించినోళ్ళతో పత్తెచ్చంగానే సెప్పుకోబట్రి. పదిరోజుల తరవాత... పోలీసులు ఊర్లో వున్నెకోళ్ళను కుక్కల్ను తినేసి వోళ్ళ బొజ్జల్నువొగయించీ ఎత్తు పెంచుకొన్నాక క్యాంపు ఎత్తేసిరి. ఆ కేసుల్లో తిరగలేక శ్యానా మంది వున్న ఆస్తి పాస్తుల్ను అమ్ముకుంట్రి. ఆ ఊరి జనాలమ్మే సెట్లను సేమల్ను, సేన్లను అంతవరకు ఇరుపచ్చాలోళ్ళను ఎగదోసి ఎనక నిలబడిన రాజకీయ నాయకులే అతి సవగ్గా కొనక్కోబట్రి.

ఇరుపక్కలా ఆస్తులు ఆరకపోతావుండె. దుడ్లు కరిగిపోతావుండె. అయినా వాళ్ళ కచ్చలు, కార్పణ్ణేలు మాత్రం సల్లారలా. మాటిమాటికీ కొట్టాడుకోవడం కచ్చిలు కట్టుకోవడం, బాంబులు యేసుకోవడం వోళ్ళ జీవితాల్లో వొగభాగంగా మారిపాయ. ఊర్లో వుండేకోరపిలకాయలకు పనీపాటా లేకండాపాయ. రాజకీయ నాయకులు వోళ్ళను తమ సెప్పుసేతల్లో పెట్టుకోబట్రి. అడ్డమైన పన్లకు వోళ్ళను ఉపయోగిస్తా వుంట్రి. దాంతో ఆ ఊరి పిలకాయల్లో శ్యానా మందికి ఖూనీల జేసేదే వుర్తిగా మారిపాయ. ఇంకొందురికదేసరదాగా మారిపాయ. వోళ్ళను దెగ్గిరికి జేర్చిన నాయకులు వోళ్ళను ప్రొఫెసనల్ కిల్లర్లుగా మార్చేసి, వోళ్ళకు జీతబత్తేలు యేరుపాటు జేసిరి.

ఎక్కడ ట్రయికు జేయాలన్నా, బందులు జేయాలన్నా, గలాటా సేయాలన్నా వోళ్ళతోనే సేయిస్తావుంట్రి. వోళ్ళకు సారాయి తాపిచ్చి, బిరేనీలు తినిపిచ్చి, తమ జీపీల్లో తిప్పుకుంటా, కడాకు వోళ్ళ కచ్చలు తీర్చుకునే దానిక్కూడా ఈళ్ళనే ఉపయోగిస్తా వుంట్రి. ఈ రాజకీయ నాయకుల పున్నెమాంట జిల్లాలో వుండే పెతి పల్లే ఇదే మాదిరిగా మారిపోయిండె. మారిపోతానే ఉండె. సిన్న సిన్న తగాదాలకే పార్టీలు బడతావుండే. వొగర్నొగరు సంపుకుంటా వుంట్రి.

ఇట్ల ఇంకొన్ని దినాలు జరిగె. కుళాయప్ప అల్లుళ్ళు బందుగులు జయరామ రెడ్ని గూడా సంపేస్తామని బెదిరింపులు మొదులు బెట్రి. జయరాముడు వోళ్ళను ఎప్పుటికైనా

సంపేయాలనే యోచ్చన్లు జేస్తావుండె. పెద్దోడయినాకముందు ఎవుర్ని, ఎట్ల సంపాలానుకుంటా ఇప్పటి నించీ దార్లు ఎదుక్కుంటా వుండె. వాగ దినము వరాలమ్మ ఇరుగుపొరుగు అమ్మలక్కల్తో కూసోని అరువులు జేసుకుంటా వుండె. ఇంతలో వున్నిట్టుండి ఏందో పేలిపోయిన శబ్దం! వాగపిడుగు పన్నిట్టుగా, భూమి వాగతూరిగా నిట్టనిలవనా పగిలి పోయినట్టుగా... ఆ శబ్దం ఊర్లో దొనిపలికె. అది, ఈదిలో ఎవురో కొట్లాడుకుంటా వాగరిమింద వాగరు బాంబు లేసుకుంటా వున్నె శబ్దర. వరాలమ్మ గుండి గెభీమనె.

" ఈ దినం ఎవుడికి మూడిందో సామి " అని గొణుక్కుంటా " వోరే జయరామూ! యాడబొయినావురా తండ్రీ " అంటా పరిగెత్తుకుంటా ఇంట్లోకొచ్చె.

" వసే ముసిల్దానా... రండే ఈదిలోకి. ఇదంతా మీ వల్లనే జరిగిందే. ఈ వూరు వల్లకాడయింది మీ వల్లనే. మిమ్మల్నిద్దర్నీ గూడా సంపేచ్చేగానీ ఈ ఊరు బాగుపడదే. నిమ్మళించదే... మా కసి సల్లారదే... " అంటా ఈదిలో నిలబడి కొందరు జనాలు అర్సబట్రి.

దాంతో ఇంట్లో వాగమూల వున్నె మచ్చుకత్తి సేతిలోకి తీసుకోని ఇంటెనక్కు పాయ జయ రాముడు. వరాలమ్మ గబగబ ఈదిలో తలుమూసి, గెడేసేసి " యాడ బోతివిరో నాయనో... ఇంగేం జేసేది తల్లో. ఇంక ఈ ముసిలి పేణానికి, ఆ పసిగుడ్డుకు దిక్కెవుర్రా తండ్రి... ఊర్లో ఈ కచ్చలు ఎప్పుడు పోతాయిరా దేముడా... " అనుకుంటా, ఇల్లంతా తారాడబట్టె. అయినా జయరాముడు కనిపించలా... అట్నే పొయ్యి గొడ్ల కొట్టం జూశ వరాలమ్మ. ఊహు... కనిపించలా. "ఏమైనాడబ్బా" అనుకుంటా ఇంటెనక్కొచ్చి సూశ. అంతే... ఆడ... జరగతా వుండేది జూసి ముసిల్ది గడగడ వణికిపాయ. నిలువెల్లా నిచ్చలకపాయ.

అక్కడ... వాగ సానరాయిని కాళ్ళకిందేసుకోని కూసోని పెద్ద యాట కొడవలి మాదిరి కనిపిస్తా వుండే వాగమచ్చు కత్తిని సేతుల్లోకి తీసుకోని దీచ్చగా నూరుకుంటా వుండె జయరాముడు.

పక్క నుండే నీళ్ళ పొంతలో అడుగడుక్కు ఎడమ సెయ్యి పెట్టి సేతినిండా నీళ్ళు తోడుకోని.. సానాయ మింద పోస్తా కోపంగా పొండ్లు పటపటా కొరుక్కుంటా " సంపేచ్చానా కొడుకుల్ని, సీల్చేచ్చా... పొడిసేచ్చా.. పొడిపొడి సేసేచ్చా... " అంటా పిచ్చి పట్నోడు మాదిరి గొణుక్కుంటా అదే పనిగా నూరుకుంటా వుండె.. గెడివు గెడివుకూ నూరే కత్తిని పైకి మల్లించి ఎడమసేతి బొట్నేలుతో కొడవలి అంచును తీడి తీడి పాదును సూసుకుంటానే సానబట్టుకుంటానే వుండె. ఆ పిల్లోడు కొడవలి సానపెడతావున్నె శబ్దం కర్రుకర్రుమంటా కర్న కటోరంగా ఇనిపిస్తానే వుండె. ఆ పిలగోడు ఈ పెపంచికంతోనే పని లేనట్టు కూసోని నూరుకుంటానే వుండె.

" వోరే నాయనా " గడగడా వణికిపోతా పిల్చె వరాలమ్మ.

వోడు ఉలకలా పలకలా ... నూరతానే వుండె. దచ్చయగ్గెనమప్పుడు ఈరబద్రుడు కత్తి నూరినట్టు ... పోతలాజు యిజయ కడ్గము నూరినట్టు. ఉలూసి కొడుకు ఇలావంతుడు కౌరవుల్ని సంపేదానికి ఆ కొండన వాగకాలు ఈ కొండన వాగకాలు పెట్టుకోని కత్తి నూరతా వున్నిట్లు ...

జయరాముడూ కత్తి నూరతావుండె.

అప్పటికి నిండా పదేండ్లు గూడా లేని జయరాముడి కండ్లల్లో కసి, పగ... రోసం... తప్ప ఇంకేమి కనిపించలా... ఏ బావమూ అనిపించల్లా.

“ ఈడబ్బుడే యేటకత్తి నూరతావుండాడే. ఎప్పుడూ నరుక్కోని సచ్చాండే ఈ గెడ్డపైన ఇంక వుండకూడదు... రామరామంటా నూరేండ్లు వోళ్ళే రాజ్జెమేలుకోనీలే.. ఇంక జాగు జేచ్చే ఈన్ని దక్కించుకోలేనేమో. ఈ కచ్చిలుకు, తగాదాలకు దూరంగా తీసకపోతా... కులంగిలంగుర్తు పట్టే దానికి లేకండా పెంచతా... యీన్నైనా బతికించుకుంటా ” అనుకుంటా వరాలమ్మ పిలగోడి సేతిలోని కత్తిందీసి పారేసి, బలంతంగా వొన్నబ్బిలించుకోని ఎత్తి భుజానేసుకోని తలుపుతెరిసె. ఈళ్ళు లోపల గెడేసుకున్నేర్లే అనుకుంటా ఈదిలో గలాటా సేస్తావున్న జనాలుఅన్నించి ఎల్లిపోయింగ్రి. వరాలమ్మ పిలగోన్ని దించి, లోపలికి బొయ్యి, వొగ పెద్ద బీగం కాయదెచ్చి, తలుపు మూసి, గెడేసి ఆ బీగం దానికేసి బిగించేసె. అనాక పిలగోన్ని దీసుకోని ఎవురికీ తేలీకుండా ఊరొదిలి వచ్చేశ.

❖ ❖ ❖ ❖

సంకురేత్తిరి నెలలో నీరెండకు నిలువునా కరిగి పోయి కండ్లకు కనిపించకండా పోయే గొడ్డు మంచు మాదిర్తో అంతవరకు జయరాముడి కండ్ల ముందర బొమ్మ కట్టిన గతమంతా కరిగిపోయి కనుమరుగైపాయ.

ఇళ్ళంతా వొగవల మాదిర్తో కట్టేసిండే దూదర గూళ్ళు తెంపుకుంటా... ఇంకొంచెం ముందుకు బొయి వొగ అరలోకి అడుగుపెట్టె. అది వొగప్పుటి పూజగది. అదే నట్టిల్లు. ఆ నట్టింటికి మనిసెత్తులో వొగ దీగూడుండె. దీయి పెట్టే గూడుకు కూడా దూదర గూళ్ళు కమ్మేసిండే. అప్పుడెప్పుడో పెట్టిండే మట్టి దీపాంతి నల్లంగా మాసిపొయ్యి కనిపిస్తావుండె. దానికి ఎడం పక్కన నైరుతిలో అయిదు దొంతికుండల వరసలు సోలువుగా కనిపిస్తా వుండాయి. దీగూటికి కుడి పక్కన దేవమూల, మడిసెత్తులో రొండు దేవుడి పటాలు గోడకు యాలాడతా వుండాయి. ఆ పటాలకు కింద, నేల మింద వొగ పెద్ద పోటాయిండె. ఆ పోటాయి పక్కనే మూరడెత్తు కంకణాలు కట్టిండే కత్తి తలకిందులుగా గోడకు ఆనిచ్చింగ్రి. అవన్నీ గూడా దుమ్ముకొట్టుకోని, కర్దవంటుకోని పోయిగబ్బొగలీజుగా కనిపిస్తావుండె.

జయరాముడు మెల్లిగా అడుగులో అడుగేసుకుంటా పొయ్యి నేల మిందుండే పోటోను జూశ. ఊహూ!... అందులో ఎవురుండారో కనిపించలా. అరసేత్తో వొగ తూరి అట్టా యిట్టా తుడిశ. సెయ్యి ఆడినంత మేరకు తెల్లంగ అద్దం కనిపించె. ఆ అద్దం కిందుండే మొగం సూసుకోని జయరాముడి కండ్లల్లో నించీ నీళ్లు జలజలా కారిపాయ... “ నాయనా! ” అంటా ఆ పోటోను ఎదకు అదుముకుండె. అది వోళ్ళ నాయన బసిరెడ్డి పోటాయి.

అట్లే మెల్లింగ నడుసుకుంటా, దూదర గూళ్ళు తెంపుకుంటా ముందరుండె ఇంగో అరలోకి పాయ. అదీ ఆ మాదిరే దుమ్ము కొట్టుకోని పోయిండె... ఆ అరలో వొగపక్కనగోడకు ఇంగొక పెద్ద పోటాయిండా. దాన్ని మెల్లిగా దించి, అద్దం తుడిసి సూశ... అది ఆ కుటింబరం వొగతూరి కొండకు ఇల్లీర్థం పోయిన్నప్పుడు, తిరమల పైన్నే వొగ స్టూడియోలో అందురూ కలిసి తీసుకున్న పోటాయి

" ధోత్ ఇదొక పాపిష్టి గడ్డ, పతి పల్లె వొగ కత్తుల బోను, పతి ఊరు వొగ బాంబుల దిబ్బ. ఇది దేశింగాదు. స్మశానం " గొణుక్కుంటా ఆ పోటాయి సాయ జూసి " పెద్ద సినాయన, సిన్న సినాయన్లూ... అమ్మా... ఏమైతిరి మీరంతా. వో తాతా! నువ్వు ఈ గెడ్డకు గాందీ మాదిరుంటివే. సూడు నీ వొంగిశం ఏమైండాదో.. ఓ అవ్వా! నువ్వు లేకంటే... నేనుగూడా మిగిలిండే వోన్ని గాదేమో..." అంటా వొగరొగర్ని తల్సుకోని తల్సుకోని యేడిశ. అట్ల యెంత సేపు యేడ్సుకున్నాడో ఆయప్పకే తెలీలా...

వున్నిట్టుండి, వొగ ఎలిక ఆయప్పకాళ్ళమింద బడి కీచకీచమంటా అర్సుకుంటా బోయ. దాంతో జయరాముడికి మొనుసు సోదీనంలో కొచ్చె. ఆ రొండు పోటోల కోసరమే ఆయప్ప వొచ్చిండె.

ఆ రెండూ సంకలో పెట్టుకోని ముందుకడుగు సాగబారి, మళ్ళా యేందో గుర్తుకొచ్చినట్టు గబగబా నట్టింట్లో అడుగుబెట్టే. ఆడ.. బసిరెడ్డి కుళ్ళాయప్ప కొడుకులు నరికేసినప్పుడు, వోళ్ళ సినాయన గారు కచ్చగట్టి, కంకణాలు కట్టిండే కత్తి కండ్లకు కనిపిచ్చె.

పోటాయిలు ఎడమసేతి సంకలో పెట్టుకోని వంగి కుడిసేత్తో ఆ కత్తిని పట్టుకోని తెచ్చి, ఇంటెనక్కొచ్చె. ఆయప్ప ఆ ఇల్లు ఇడిసిపెట్టేసొచ్చినప్పుడు కొడవలి నూరతావున్న నూర్రాయి అట్టే వుండాది. దానికవతలుండే సెత్త కుప్పా అట్టే వుండాది. జయరాముడదంతా వొగతూరి కలయజూసి, కోపంతో కుడి సేతిలో వుండే కత్తిని ఇసిరి ఆ సెత్త కుప్పలో యేసేశ.

అనాక... ఫోటాయి లెత్తుకోని రాసీడు దారిబట్టె.

" ఈ అన్నేకారి గెడ్డన ఈ కచ్చలు, ఖూనీలు ఎప్పుడు పోతాయో... మళ్ళా ఈ మడుసుల్లో మనూరు, మనోళ్ళు అనే మంచితనం, మానవత్వం ఎప్పుడు పుడుతుందో ననుకుంటా, ఈది దాటె, ఊరు దాటె. రాసీడుకల్లా నడిసి పోతానె వుండె. ఆయప్ప నడిసేగుందికీ దూరమైతావుండే ఆ పల్లెమింద నించీ వచ్చిన గాలి రవరవాంట ఆయప్పను తాకతావుండిపాయ.

***● ఇది 26 నవంబర్ నుంచీ 10 డిసెంబర్ వరకు, ఆంధ్రజ్యోతి, వార పత్రికలో ప్రచురింపబడిన మూడు వారాల కథ ●***